క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయసూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఓటర్ల జాబితా రూపకల్పన పారదర్శకంగా జరగాలని తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ అన్నారు. రాజవోలులోని ఏఎంజీ ఆడిటోరియంలో శుక్రవారం నియోజకవర్గ బూత్‌స్థాయి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల నమోదు, తొలగింపు నేపథ్యంలో కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఉద్దేశపూర్వకంగా ఏదైనా ఉల్లంఘన జరిగితే సంబంధిత బీఎల్‌వోను జవాబుదారుగా చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ చైతన్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి...ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం.. అనే నినాదంతో యూటీఎఫ్ ముద్రించిన పోస్టర్‌ను శుక్రవారం మధ్యాహ్నం కడియంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు.

బీజేపీ నాయకుల 'పల్లెకు పోదాం'



పాఠశాలను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం తదితరులు

కడియం: బీజేపీ మండల నాయకులు శుక్రవారం పల్లెకు పోదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. వాటి పనితీరు, అక్కడి అందిస్తున్న సేవలను పరిశీలించారు. వీటిపై నివేదికను తయారు చేసి పార్టీ ఎంపీ, ఎమ్మెల్సీలకు అందజేస్తామన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఈ5 సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో ప్రకాశం నగర్, లేడీస్ క్లబ్ ఏరియా, ఆర్‌కే హాస్పిటల్ ఏరియా, చిన్న ఆంజనేయస్వామి గుడి ఏరియా, దానవాయిబాబు పుట్ట, భాస్కర్ రాజు హాస్పిటల్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

ధర్నాలకోటకు అంబేడ్కర్ అవార్డు



రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డు 2025 లభించింది. న్యూఢిల్లీలోని ఇండియన్ మీడియా కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ అక్లహ్ అహ్మద్ శుక్రవారం వెంకటేశ్వరరావుకు ఈ అవార్డును ప్రకటించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఏటా అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డులు అందజేస్తారు. న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ధర్నాలకోట వెంకటేశ్వరరావు సేవలను గుర్తించి ఈ ఏడాది ఆయనకు ఈ అవార్డు అందచేశారు.

కాతేరు పంచాయతీకి ట్రాక్టర్ల అందజేత



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న పేపరు మిల్లు ఈడీ ముఖేష్ జైన్, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ పేపరుమిల్లు తన సీఎస్ఆర్ నిధులతో రూ.20 లక్షలతో కాతేరు గ్రామపంచాయతీకి రెండు ట్రాక్టర్లను అందజేసింది. వీటిని శుక్రవారం ఆ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి ఏపి పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్ జైన్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్ల గ్రామంలో వాటర్‌ట్యాంకులు, సీసీ రోడ్లను ప్రారంభించారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు, మార్గాని నాగేశ్వరరావు



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న షర్మిలారెడ్డి తదితరులు



జేగురుపాడులో పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న స్టాలిన్ తదితరులు

మహిళా విద్యకు మార్గదర్శకుడు పూలే

- మాజీ మంత్రి వేణు
- ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి
- విగ్రహాలకు ఘన నివాళి

రాజమహేంద్రవరం రూరల్: మహిళా విద్యకు మార్గదర్శకుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు అంగాడ సత్య ప్రియ, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పెయ్యాల రాజేష్, ముద్దాల అను, యెనుముల త్యాగరాజు, చాప రాజా, ఓడూరి రాంకీ, రామా రెడ్డి, చింతపర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశయాల సాధనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: పూలే ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి మహనీయులు.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి వేణు

అసమానతలపై పోరాటం

సీటీఆర్ఐ: సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. రాష్ట్ర బీసీ యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్ ఆధ్వర్యంలో ఏవీఆర్ రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి, రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ కామర్స్ అధ్యాపకుడు వెంకట రమణ పాల్గొన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలన

రాజమహేంద్రవరం రూరల్: కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ విద్యకు పాటుపడిన తొలి సామాజికవేత్త జ్యోతిరావు పూలే అని రాష్ట్ర భారతీయ జనతా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ కొనియాడారు. కాతేరు నాయా బ్రాహ్మణ కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

● శాటిలైట్ సిటీ గ్రామంలోని కల్యాణ మంటపంలో జరిగిన వేడుకలకు రొంగల గోపీ శ్రీనివాస్, మండలం–2 బీజేపీ అధ్యక్షుడు మట్టా నాగబాబు హాజరయ్యారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి..

కడియం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. జేగురుపాడులోని ఆయన విగ్రహానికి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. ఎంపీటీసీ ఆకుల సుధాకర్, బీసీ నాయకులు మారిశెట్టి నాగన్న, బుడ్డిగ గణపతి, బుడ్డిగ రాంబాబు, లక్ష్మణరావు, అంగర రాజు, బోడా అచ్యుత్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి విందుకు ముస్లింలకు ఆహ్వానం



అన్నసమారాధనకు హాజరైన ముస్లింలతో హిందువులు

సీటీఆర్ఐ: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా నెహ్రూనగర్ సీతారాముల మందిర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ హిందువులతో పాటు ముస్లింలను కూడా ఆహ్వానించారు. ఈ సందర్భంగా 3, 4 డివిజన్లకు చెందిన ముస్లిం ఈ కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. హిందూ ముస్లిం సమైక్యతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. బొంతా శ్రీహరి, నక్కా నగేష్, ఎన్వీ శ్రీనివాస్, బళ్లా శ్రీనివాసరావు, జక్కంపూడి అర్జున్, కాలేపు సాయిరామ్, అమీర్, అల్లాఉద్దీన్, అజీమ్, రబ్బానీ, ముస్తఫా తదితరులు హాజరయ్యారు.

కార్పొరేషన్‌లో అగ్ని ప్రమాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనా స్థలాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వచ్చి బిల్లు కలెక్టర్లకు సంబంధించిన షాపు అద్దెలకు చెందిన ఐదు ఫైళ్లు స్వల్పంగా దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు. డ్యూటీ చేస్తున్న సిబ్బంది గుర్తించి వెంటనే మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత



స్కూల్ టాపర్‌గా నిలిచిన లోహితకు ట్రోఫీని అందజేస్తున్న రాము, దుర్గబాబు

ధవళేశ్వరం: పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత అని, దానిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మ్యాం ఏజీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ రాము అన్నారు. ఐటీసీ సహకారంతో ఏజీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వావ్ కార్యక్రమంలో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వావ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్‌నకు సంబంధించి విద్యార్థులు సేకరించిన పాత పుస్తకాలు, పేపర్లను నిర్వాహకులకు అందజేశారు. రాము మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగమైన చెట్లను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పేపర్‌ను తొమ్మిది సార్లు రీసైక్లింగ్ చేయవచ్చని వివరించారు. పేపర్ రీసైక్లింగ్ ద్వారా చెట్లను కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై దృష్టి సారించాలని సూచించారు. ఏజీఎస్ స్కూల్ కో ఆర్డినేటర్లు దుర్గబాబు, కృష్ణ మాట్లాడుతూ ఒక టన్ను పేపర్ తయారు కావాలంటే 17 చెట్లు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ రీసైక్లింగ్‌కు సహకరిస్తే మన వంతుగా చెట్లను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న కదలి లోహితకు ట్రోఫీ, తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

సంక్షేమ వసతి గృహాల సందర్శన



వసతి గృహంలోని వంటశాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి సందర్శించారు. మల్లయ్యపేటలోని సాల్వేషన్ ఆర్మీ సన్‌షైన్, బాబా నగర్‌లోని గుణపల్లి లీల ఆనంద్ ట్రస్ట్ మిషన్, హోమ్ ఫర్ బాయ్స్, షాలోమ్ ఔట్రీచ్ మినిస్ట్రీస్ బాయ్స్, గుణపల్లి లీల ఆనంద్ ట్రస్ట్ గ్రేస్ హోమ్, దానవాయిపేటలోని చిల్డ్రన్ హోమ్ ఫర్ గరల్స్, షాలోమ్ ఔట్రీచ్ మినిస్ట్రీస్ బాలికల హోమ్‌ను సందర్శించి, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా, ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

ప్రాణం తీసిన అతి వేగం

- బైక్‌పై నేపాల్ వెళ్తూ ప్రమాదానికి గురైన దంపతులు
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు

పూసపాటిరేగ: మితిమీరిన వేగం భార్య ప్రాణాలు తీయగా, భర్తను క్షతగాత్రుడిని చేసింది. బైక్‌పై నేపాల్ వెళ్తున్న రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారం ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రాజమహేంద్రవరానికి చెందిన సంబూరి నాగసత్యలక్ష్మి, భార్గవరాజు దంపతులు కోయంబత్తూర్‌లోని ఈషా యోగా కేంద్రంలో పనిచేస్తున్నారు. ఇటీవల సొంతూరు రాజమహేంద్రవరానికి వచ్చారు. నేపాల్ పర్యటన కోసం ఉదయం 6 గంటలకు బయలుదేరారు. 10.30 గంటలకు బైక్ అదుపు తప్పి సీహెచ్ అగ్రహారం ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో బైక్ వేగం ఎక్కువగా ఉండడంతో వంద మీటర్ల వరకు ఇద్దరినీ ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో నాగసత్యలక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు విడవగా, భార్గవరాజుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేసిన డాక్టర్ అనసూరి పద్మలత, కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: మహిళల విద్యకు జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధ్యక్షురాలు, జాతీయ బీసీ సంఘం జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. జననేత బత్తిన సుబ్బారావు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో సుబ్బారావు నగర్‌లో పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుసూరి పద్మలత, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ స్టేట్ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ చేతుల మీదుగా పేద మహిళలకు నిత్యావసరాలు, కూరగాయలు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం అనుసూరి పద్మలతకు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బర్రే అనూహెలినియా, బర్రే మరియ, బత్తిన సుబ్బారావు సేవాసమితి కార్యదర్శి ఖాన్, కార్యనిర్వాహక కార్యదర్శి గారా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సీమంతంలో పాల్గొన్న సీడీపీవో నాగమణి, మత్సేటి ప్రసాద్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య వంతమైన బిడ్డకు జన్మనిస్తారని రాజానగరం సీడీపీవో నాగమణి అన్నారు. బొమ్మూరులోని జేఎల్‌బీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 15మంది గర్భిణులకు సీడీపీవో నాగమణి, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కూటమి నాయకులు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కనకవల్లి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బీఎస్పీ నాయకుల ధర్నా



జేసీ చిన్నరాముడికి వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

సీటీఆర్ఐ: బీసీ జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 52 శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024 జనవరి, ఫిబ్రవరి నెలల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా బీసీ జనాభా లెక్కలు సేకరించిందన్నారు. దాని ప్రకారం రాష్ట్రంలో 52 శాతం బీసీలు ఉన్నారన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని బీఎస్పీ కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జేసీ చిన్న రాముడికి వినతి పత్రం అందజేశారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం



డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంగా ఉన్నామని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పేరూరి శ్రీనివాస్ అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై రూరల్ తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ అధ్యక్షతన జరిగిన మూడు రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజమండ్రి ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మాస్టర్ ట్రైనర్ ఎం.బ్రహ్మానందం డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం రాజమండ్రి అగ్నిమాపక కేంద్రంలో అధికారులకు విపత్తుల సమయంలో ఎలా కాపాడతామన్న విషయాలపై ఏడీఎఫ్ఓ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, తుపానులు, వరదలు, భూకంపం తదితర ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో అగ్నిమాపకశాఖ ఏ విధంగా ప్రజలను రక్షిస్తుందన్న విషయాలను వివరించారు. రూరల్ తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన అధికారులందరూ తమ పరిధిలో అధికారులతో పాటు సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, వ్యవసాయాధికారి ఎ.భీమరాజు, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడిబాట ర్యాలీ

కంబాలచెరువు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించాలని, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ కోరారు. 35వ డివిజన్ కోర్లమ్మపేట నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట ర్యాలీని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని సేవా రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ఎంసీ చైర్ పర్సన్ ఎం.వనిత, ఉపాధ్యాయులు ఆనంద్, దేదీప్య పాల్గొన్నారు. వార్డులో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తొలిరోజే 11 అడ్మిషన్లు రావడం శుభపరిణామని దిలీప్ కుమార్ అన్నారు.

పన్ను చెల్లింపునకు 30 వరకూ గడువు పొడిగింపు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నుల బకాయిల చెల్లింపునకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీని పొందాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్ను ఒకేసారి చెల్లించిన వారికి ఇచ్చే ఐదుశాతం రిబేట్ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

భూమికి సారం.. పంటకు జీవం

- మూడో పంటగా అపరాల సాగు
- పచ్చిరొట్టతోనూ ఎంతో ప్రయోజనం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: భూమి సారవంతంగా ఉంటేనే సాగు చేసిన పంట మంచి దిగుబడినిస్తుంది. అందుకే ఖరీఫ్, రబీ సీజన్ల అనంతరం వేసవి పంటగా జీలుగ, జనుము, ఉలవ, పిల్లిపెసర వంటి వాటిని రైతులు సాగు చేసి, భూసారాన్ని పెంచేందుకు కృషి చేస్తుంటారు. మెట్ట ప్రాంతంలో రబీ సీజన్‌లో వరి కోతలు జరుగుతున్న ప్రస్తుత సమయంలో ఆయా భూముల్లో కొందరు రైతులు అపరాలను, మరికొందరు పచ్చిరొట్టను సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని రాజానగరం మండలం నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, సీతారామపురం, తూర్పుగానుగూడెం, రామస్వామిపేట, పల్ల కడియం, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం, వెంకన్నపేట, వడిశలేరు తదితర గ్రామాల్లో అపరాలను సాగుచేస్తున్నారు. నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి. యర్రంపాలెం, ముక్కినాడ, పీఆర్సీపురం, అనపర్తి మున్నగు ప్రాంతాలలో వరి పంట కోతలు కాస్త ఆలస్యం కావడం వల్ల ప్రస్తుతం ఇక్కడ అపరాలతో పాటు భూసారానికి పనికి వచ్చే పచ్చిరొట్ట పైర్లను సాగుచేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.



జీలుగ సాగు ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

భూసారాన్ని పెంపొందించడానికి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అధిక దిగుబడులు సాధించడం కోసం రసాయన ఎరువులను అధికంగా వాడితే భూసారం దెబ్బతింటుందనే విషయాన్ని గ్రహించాలి. అటువంటి సమయంలో ఏ పంటలు సాగు చేసినా సరైన ఫలితాలు ఇవ్వలేవు. సాగు భూములు భూసారాన్ని కోల్పోయి, దిగుబడులు కూడా పడిపోతాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. భూసారాన్ని పట్టించుకోకుండా పంటలను పండించుకుంటూ పోతే అవి చౌడు భూములుగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

మూడో పంటగా..

రబీ సీజన్ తర్వాత మూడో పంటగా భూసారాన్ని పెంచేలా జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి వాటితోపాటు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమేపీ తగ్గిస్తూ పూర్వకాలం పద్ధతులను అనుసరించేలా పశువుల పెంటను ఎరువుగా పొలాల్లో వేసి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ఈ పైర్లు పూత దశలో ఉండగా ఆ భూమిని దున్నడం వలన వాటిలోని స్థూలపోషకాలు భూమికి చేరి, భూసారం పెరుగుతుంది. వీటిలో నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుండి 2 శాతం వరకు ఉంటాయి. స్థూలపోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

భూసారాన్ని పెంచేలా..

రబీ పంట తర్వాత భూసారాన్ని పెంపొందించేలా అపరాలు, పచ్చిరొట్ట పైరులను వేయడం మంచిది. ఇందుకోసం మినుము, జనుము, జీలుగ విత్తనాలను రైతులు అందించేందుకు ఇండెంట్ పంపించాం. అలాగే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే భూసారాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది.

– ఎస్‌కే ఇమామి ఖాసిమ్, రాజానగరం మండల వ్యవసాయాధికారి